సాక్షి
తిరుపతి
గురువారం । 30 । మే । 2024



తొలిరోజే విద్యాకానుక కిట్లు

బడులు ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. - 8లో



అనధికార దుకాణాలపై కొరడా

తిరుమలలో అనధికార దుకాణాలు, తట్టలపై రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. - 8లో



కోర్టుల వద్ద పటిష్ట భద్రత

తిరుపతిలోని కోర్టుల సముదాయం వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఐదంచెల భద్రత అమలు చేస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఇప్పటికే దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సందర్శకుల రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,381 మంది స్వామివారిని దర్శించుకోగా 33,509 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

డిగ్రీ కళాశాలలకు సెలవులు పొడిగింపు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు జూన్ 6వ తేదీ వరకు సెలవులు పొడిగిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. గతంలో మే 31 వరకు ఉన్న సెలవులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 6వ తేదీ వరకు పొడిగించామన్నారు. జూన్ 7వ తేదీన కళాశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు. ఆదేశాలను ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలు తప్పక పాటించాలని సూచించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 154 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా మూడో రోజైన బుధవారం 154 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో భాగంగా 27,001 నుంచి 43 వేల ర్యాంకు వరకు జరిగిన కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం 43,001 నుంచి 59 వేల ర్యాంకు వరకు సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జీ.ద్వారకనాథ రెడ్డి తెలిపారు.

ఆనర్స్..అదుర్స్!

సాధారణ చదువులకు ఫుల్‌స్టాప్ పెట్టేశారా.. పీజీ కోర్సులు చదవకుండానే నేరుగా పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తున్నారా..? అంటే అవుననే అంటున్నారు తిరుపతిలోని టీటీడీ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు. మూడేళ్ల సాధారణ డిగ్రీ స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సు గత ఏడాది ప్రవేశపెట్టారు. అటానమస్ హోదాలో ఈ ఏడాది తొలిసారిగా అడ్మిషన్ల ప్రక్రియకు సిద్ధమవుతున్నారు. ఈ కోర్సు పూర్తవగానే ప్రసిద్ధి చెందిన దేశీయ, విదేశీయ యూనివర్సిటీలలో ఎమ్మెఎస్ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొంటున్నారు. ఈ కోర్సు విధివిధానాలు.. ప్రవేశాలపై నేడు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.



ఎస్వీయూ రిజిస్ట్రార్‌తో సమావేశమైన టీటీడీ కళాశాలల అధికారులు



- టీటీడీ డిగ్రీ కళాశాలల్లో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సు
- తొలిసారి అటానమస్ హోదాలో అడ్మిషన్లకు సిద్ధం
- ఉద్యోగాలకు సువర్ణావకాశం
- పీహెచ్‌డీ, ఎమ్‌ఎస్ కోర్సులకు అర్హత
- ఏడాది కోర్సుకు సైతం డిప్లొమో సర్టిఫికెట్
- జూన్ మొదటి వారంలో నోటిఫికేషన్!
- నేడు ఎస్వీయూలో కమిషనర్ దిశానిర్దేశం

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలు అటానమస్ హోదాలో తొలిసారి అడ్మిషన్లకు సిద్ధమవుతున్నాయి. 2024–25 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు జూన్ మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నాయి. ఇందులో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. నూతన విద్యావిధానంలో భాగంగా ఈ సారి కొత్తగా ప్రవేశపెట్టిన డిగ్రీ ఆనర్స్ కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నాయి. ఇంటర్మీడియెట్, తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల శాతం ఆధారంగా ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విభాగాలలో డిగ్రీలో అడ్మిషన్లు ఇవ్వనున్నాయి. ఈమేరకు అడ్మిషన్ల ప్రక్రియ, విధి విధానాలపై బుధవారం ఎస్వీయూ రిజిస్ట్రార్‌తో టీటీడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్చించనున్నారు.



డిగ్రీ ఆనర్స్‌తో పీహెచ్‌డీ, ఎమ్మెఎస్ కోర్సులకు అర్హత

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పీజీ కోర్సులు చదవాల్సిన పనిలేదు. నేరుగా పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలకు జరిపే ఏపీఆర్‌సెట్‌కు అర్హత పొందుతారు. అదేవిధంగా ఇంజినీరింగ్‌లో బీటెక్ చేసిన విద్యార్థులతో సమానంగా డిగ్రీ ఆనర్స్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రసిద్ధిగాంచిన దేశీయ, విదేశీ యూనివర్సిటీలలో ఎమ్మెఎస్ కోర్సులో అడ్మిషన్లు పొందుతారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు పేరొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా సిలబస్‌తో పాటు నాణ్యమైన విద్య పొందవచ్చు.

సువర్ణావకాశం

కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ (ఎన్‌ఈపీ)లో భాగంగా గతంలో మూడేళ్ల కాలవ్యవధి ఉన్న సాధారణ డిగ్రీని ప్రస్తుతం నాలుగేళ్ల కాలవ్యవధితో ఆనర్స్ డిగ్రీగా మార్పు చేశారు. ఇందులో విద్యార్థుల ఆసక్తిని బట్టి తాము నాలుగేళ్ల పాటు పూర్తిగా కొనసాగలేకపోయినా మధ్యలో చదువు ఆపివేసినా అంతవరకు పూర్తి చేసిన కాలానికి సంబంధిత సబ్జెక్ట్‌లో సర్టిఫికెట్లు, డిప్లొమో, పట్టాను అందించే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా డిగ్రీ ఆనర్స్ కోర్సులో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఏడాదితో ఆగిపోయి కొంతకాలం తర్వాత తిరిగి కోర్సును పూర్తి చేసుకునేందుకు అడ్మిషన్లు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

నేడు దిశా నిర్దేశం



2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియతో పాటు, సింగిల్ మేజర్ సబ్జెక్ కోర్సులు, డిగ్రీ ఆనర్స్ కోర్సులకు సంబంధించి ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా నాలుగు జిల్లాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్‌తో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. గురువారం ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల ప్రిన్సిపాల్స్‌తోనూ, శుక్రవారం ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆయన రివ్యూ మీటింగ్ జరపనున్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు మెరిట్ ప్రాతిపదికన టీటీడీ కళాశాలల్లో అడ్మిషన్లు, ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తాం.

–ఎం భాస్కర్‌రెడ్డి, టీటీడీ డీఈఓ, తిరుపతి

అడ్మిషన్లకు సర్వం సిద్ధం



ఎస్వీ ఆర్ట్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల కాగానే అడ్మిషన్లు చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశాం. కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి 22 సబ్జెక్టుల్లో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాలలో మొత్తం 1,470 సీట్లు ఉన్నాయి. టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు నాలుగేళ్లకు సంబంధించి మెరిట్ విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన మొత్తం 1,800 మందికి ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించనున్నాం.

– ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

అటానమస్ హోదాలో తొలిసారి



టీటీడీ అధికారులు, కళాశాల సిబ్బంది సహాయ సహకారాలతో పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల అటానమస్ హోదా పొందింది. తొలిసారి అటానమస్ హోదాలో డిగ్రీ అడ్మిషన్లు చేపట్టబోతున్నాం. కళాశాలలో ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విభాగాలలో 21 సబ్జెక్ట్‌లకు సంబంధించి 1,550 సీట్లు భర్తీ చేస్తాం. నాలుగేళ్లకు కలిపి మొత్తం 2,100 మంది విద్యార్థినులకు హాస్టల్, ఉచిత భోజనవసతి కల్పిస్తున్నాం.

–డాక్టర్ టీ.నారాయణమ్మ, ప్రిన్సిపల్, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, తిరుపతి

ఉపాధే లక్ష్యం



నూతన విద్యా విధానంలో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన డిగ్రీ ఆనర్స్ కోర్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆనర్స్ డిగ్రీ ఎంతో ఉపయోగపడుతుంది. ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ గ్రూప్‌లకు సంబంధించి 19 సబ్జెక్ట్‌లలో 1,068 సీట్లుకు ప్రతి ఏడాదీ మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం అడ్మిషన్లు కల్పిస్తున్నాం. ఉచిత హాస్టల్ వసతి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు కలిపి సుమారు 1,400 మందికి వసతి కల్పిస్తున్నాం. ఈ ఏడాది అడ్మిషన్ల నోటిఫికేషన్ కోసం సిద్ధంగా ఉన్నాం.

–డాక్టర్ టీ.సత్యనారాయణ, ప్రిన్సిపల్, ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను వివరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం భారత సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఇతర అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో చేపట్టిన ఏర్పాట్లను చేపట్టిన ఆయన అడిగి తెలుసుకున్నారు. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొని, ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను వివరించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 90సీసీ కెమెరాల ఏర్పాటుతో నిరంతర నిఘా పెట్టినట్లు వెల్లడించారు. తిరుపతి, చంద్రగిరి రెండు నియోజకవర్గా ఓట్ల లెక్కింపును 20 లేదా 22 రౌండ్లలో పూర్తిచేస్తామని తెలిపారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అభ్యర్థులు 46 మంది ఉన్నారని, సాయంత్రం 4.30 గంటలకు అన్ని నియోజకవర్గాల ఫలితాలు పూర్తవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు రోజూ సీసీటీవీ కంట్రోల్ రూం ద్వారా స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద దాదాపు అన్ని ఏర్పాట్ల పూర్తయ్యాయని వివరించారు. చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, వాటిలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి అదితిసింగ్ మాట్లాడుతూ తమ పరిధిలో 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కౌంటింగ్ సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సూళ్లూరుపేట రిటర్నింగ్ అధికారి చంద్రముని తమ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను వివరించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ కౌంటింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల భద్రత నేపథ్యంలో షాడో పార్టీలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 150 మంది సెక్యూరిటీ సిబ్బందితో పాటు బయట 100 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 73 మొబైల్ పార్టీలు, 53 ఎస్కార్ట్ టీమ్స్ పని చేస్తున్నాయన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు ధ్యానచంద్ర(వెంకటగిరి), నిషాంత్‌రెడ్డి(చంద్రగిరి), కిరణ్‌కుమార్(గూడూరు), నరసింహులు(సత్యవేడు), అదనపు ఎస్పీ వెంకట్రావు, కులశేఖర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల పరిశీలన



గ్రామాల్లో పర్యటిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు



చంద్రగిరి నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ విష్ణువర్ధన్ రాజు

చంద్రగిరి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తున్న కొద్దీ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుశాఖ అన్ని విధాలుగా చర్యలను చేపడుతోంది. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాలను ఎస్పీ విష్ణువర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాలను సందర్శించి అక్కడి స్థానికులతో మమేకమయ్యారు. బుధవారం రాత్రి ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన పనపాకం, కల్‌రోడ్డుపల్లి, కాశిపెంట్ల, కోనంగివారిపల్లి, ముంగిళిపట్టు, కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాలను సందర్శించారు. స్థానికులతో సమావేశమై శాంతి భద్రతల విషయంలో గ్రామస్తుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. పాటించాల్సిన కార్యాచరణను చంద్రగిరి సీఐకి వివరించారు. గ్రామంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కోవాలని ఆదేశించారు. అదే సమయంలో చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ దేవరాజు మనీష్‌పటేల్, శాంతి భద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్, చంద్రగిరి సీఐ రామయ్య, చంద్రగిరి పోలీసులు, జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



చలువ పందిరిలో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన పోలేరమ్మ

కల్పవల్లి..ప్రణమిల్లి!

- నాయుడుపేట జాతరకు పోటెత్తిన జనం
- పోలేరమ్మ ప్రతిమ నిమజ్జనంతో జాతర పరిసమాప్తం



ప్రత్యేక పూల సప్పరంపై కొలువుదీరి ఊరేగుతున్న పోలేరమ్మ తల్లి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ తల్లి జాతర బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. 'పోలేరమ్మా.. మమ్మేలు మాయమ్మా.. కరుణించు తల్లీ.. కాపాడు కల్పవల్లీ' అంటూ భక్తులు వేడుకున్నారు. పోలేరమ్మ తల్లిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి నిమజ్జనోత్సవంతో జాతర ఘనంగా ముగిసింది.

విశేష అలంకరణలు

మొదట పట్టణంలోని సెట్టిపల్లి వారి వీధిలో ఉన్న అలంకార గుడి వద్ద వెంకటగిరి రాజాలు బహూకరించిన వెండి హస్తాలు, పాదాలతో పాటు పలువురు దాతలు అందించిన పూజా సామగ్రితో పోలేరమ్మ ప్రతిమను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భేరిపేట నుంచి ప్రత్యేకంగా పూలతో అలంకరించిన సప్పరంపై ఊరేగింపుగా తీసుకొచ్చి బుధవారం తెల్లవారుజామున పోలేరమ్మ ఆలయం సమీపంలో చలువ పందిరి వద్ద పీఠంపై ప్రతిష్ఠించారు. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలేరమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వెయ్యి కళ్ల దుత్తల్లో దీపాలు వెలిగించి, వేప మండలు చేతబూని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణ చేశారు. గడియారం సెంటర్ వద్ద నుంచి చిన్నదర్గా అవతలి వరకు భక్తులు బారులు తీరారు. అదేవిధంగా రూ.100 ప్రత్యేక దర్శనాలకు సైతం భక్తులు పోటెత్తారు.

భక్తుల తోపులాట

చలువ పందిరిలో కొలువైన అమ్మవారి ప్రతిమను తరలించిన వెంటనే పందిరికి ఏర్పాటు చేసిన వేప రెమ్మల కోసం భక్తులు పోటీ పడ్డారు. వీటిని ఇళ్ల వద్ద ఉంచుకుంటే ఎలాంటి కీడు జరగదని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో వాటిని దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడడంతో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది.

మజ్జిగ, శీతల పానియాల పంపిణీ

జాతర సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులకు మజ్జిగ, శీతల పానీయాలను పంపిణీ చేశారు. ఆలయం వద్ద దాతలు అంబలి, మజ్జిగ చలివేంద్రాలు, అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు.



అమ్మవారి దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

పోలీస్‌స్టేషన్‌పై రాళ్ల దాడి

పోలేరమ్మ జాతర నిమజ్జనోత్సవంలో బుధవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఓ యువకుడు మద్యం మత్తులో పోలీసులతో దురుసుగా ప్రవర్తించగా.. అతన్ని తిరుపతి స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భేరిపేట ప్రాంతానికి చెందిన యువత నిమజ్జనోత్సవానికి అడ్డుతగిలారు. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌పై రాళ్ల దాడి చేశారు. స్టేషన్ అద్దాలు పగిలాయి. పోలీస్ స్టేషన్ ఆవరణలో నిలుచుని ఉన్న ఓ యువతి గాయపడింది. రాళ్ల దాడి చేసిన అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అట్టహాసంగా నిమజ్జనోత్సవం

సాయంత్రం విన్నమాల పెద్దకాపుగా పిలవబడే అరవభూమి శ్రీనివాసులురెడ్డి, ధీరజ్‌రెడ్డి, ఆకుల కుబేరు మణి, రాగి శేషగిరితో పాటు సీఐ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ గోపి, దేవదాయశాఖ ఈఓ శశంక్, జాతర నిర్వాహకుల ఆధ్వర్యంలో విన్నమాల గ్రామస్తులు పొలికేకతో పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారి ఎదుట కుంభం పోసి పొలి తిరిగారు. అనంతరం చలువ పందిరిలో ఉన్న పోలేరమ్మ ప్రతిమను సమీపంలో పోలేరమ్మ చావడికి తరలించారు. తర్వాత అమ్మవారికి పిండి దీపారాధన జరిపి నిమజ్జనానికి తరలించారు. రాజగోపాలపురం వీధి, భేరిపేట నుంచి తీసుకువచ్చిన భారీ గజమాలలను అమ్మవారికి అలంకరించారు. నిమజ్జనోత్సవం పోలీస్‌స్టేషన్ మీదుగా పాత వెల్‌కం సెంటర్, పెద్ద దర్గా మీదుగా పోలేరమ్మ మాను వరకు చేరింది. యువత డీజే పాటలు, తీన్‌మార్ బ్యాండు మేళాలు, పంచవాయిద్యాలతో సందడి చేశారు. అక్కడి నుంచి భక్తులు అమ్మవారిని పూల రథంపై నుంచి నిమజ్జనం చేసేందుకు పెద్ద ఎత్తున కిలారింపులు చేస్తూ తరలించుకు పోయారు. వైదేహి షాపింగ్ మాల్ వారి సౌజన్యంతో చేపట్టిన పూల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.



యువత..కేరింత

6 వరకు ఎన్నికల కోడ్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ వర్తిస్తుందని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ ముగియడంతో ఆ తర్వాత కోడ్ ఉండదని పలువురు భావిస్తున్నారని, అయితే ఎన్నికల షెడ్యూల్‌లోనే జూన్ 6వ తేదీ వరకు కోడ్ ఉంటుందని స్పష్టం చేసినట్లు ఆయన గుర్తు చేశారు. జూన్ 4వ తేదీన తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తిరుమలలో జూన్‌లో విశేష ఉత్సవాలు

తిరుమల: తిరుమలలో జూన్‌లో జరిగే విశేష ఉత్సవాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు తిరుమలలో ఆకాశగంగ – అంజనాద్రి – బాలాంజనేయ స్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, 2న మహి జయంతి, 19 నుంచి 21వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం, 20న శ్రీ నాథమునుల వర్ష తిరునక్షత్రం, 22న పౌర్ణమి గరుడసేవ నిర్వహించనున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- మరో నలుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చంద్రగిరి: ప్రమాదవశాత్తు కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, ఎం.కొంగరవారిపల్లి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరుకు చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ రామ్మూర్తి(75) తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలసి కారులో వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం బుధవారం ఉదయం చిత్తూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. ఎం.కొంగరవారిపల్లి వద్ద వెళ్తున్న క్రమంలో కారు వెనుక టైరు పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా కారు పల్టీలు కొట్టుకుంటూ, రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంలో కూర్చున్న రామ్మూర్తి తలకు తీవ్ర గాయం కాగా, ఆయన భార్య సావిత్రి, కుమారుడు సురేష్, కుమార్తె పద్మ, మనుమడు తేజకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామ్మూర్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

సత్యవేడు: మండలంలోని అలిమేలు మంగాపురం అటవీ ప్రాతంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు బుధవారం మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడికి 70 ఏళ్లపైన ఉంటుందని, మూడునాలుగు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో అక్కడే పంచనామా నిర్వహించి పంచాయతీ అధికారులు, సర్పంచ్ శిరీషా, గ్రామపెద్ద శ్రీనివాసులురెడ్డి అక్కడే పూడ్చిపెట్టారు.

తొలిరోజే విద్యాకానుక కిట్లు

- ఐదో విడత పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లాలోని 34 స్టాక్ పాయింట్లకు దశలవారీగా చేరవేత
- అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా
- లబ్ధి పొందనున్న 1,48,776 మంది విద్యార్థులు



జిల్లా స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న సర్వ శిక్ష జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సురేష్



జిల్లా స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్ల సామగ్రిని పరిశీలిస్తున్న డీఈఓ డాక్టర్ శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం వచ్చింది. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. సామాన్యులకు సైతం కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందించే లక్ష్యంగా ఈ రెండు వ్యవస్థల్లో సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక వంటి పలు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. నాడు పాఠశాలల పునఃప్రారంభమైన మూడునాలుగు నెలలకు పాఠ్యపుస్తకాలందుతుంటే నేడు పాఠశాల పునఃప్రారంభించిన తొలిరోజే జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు బడి తెరిచే రోజునే 9 రకాల వస్తువులతో కూడిన విద్యా కానుక కిట్లు అందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. గడిచిన నాలుగేళ్ల పాటు విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యాకానుక కిట్ల పంపిణీలో ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. దీంతో పాఠశాల తెరిచే రోజునే జిల్లాలోని 1,48,776 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించేందుకు సమగ్ర శిక్ష అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి విడతల వారీగా విద్యా కానుక కిట్లు చేరుకుంటున్నాయి. వీటిని జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్లో భద్రపరిచారు. అక్కడి నుంచి వాటిని జిల్లాలోని 34 మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు విడతల వారీగా తరలిస్తున్నారు. ఇక్కడ వీటిని ఒక కిట్‌గా అమర్చి విద్యార్థులకు అందించనున్నారు.

విద్యా కానుక కిట్ ఇదే

స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం క్లాత్, జత షూస్, రెండు జతల సాక్సు, బెల్టు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలతో కలిపి 9రకాల వస్తువులు ఉంటాయి.

కిట్ ధర రూ.1,667

పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ స్థాయి విద్యనభ్యసించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అయితే తల్లిదండ్రులపై ఆర్థిక భారం కలగకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ముఖ్యమంత్రి విద్యా కానుక పథకాన్ని ప్రవేశ పెట్టారు. తొమ్మిది రకాల వస్తువులతో కూడిన ఒక్కో కిట్ విలువ రూ.1,667 ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

తొలిరోజే జేవీకే పంపిణీ

జగనన్న విద్యా కానుక కిట్లకు సంబంధించిన 9రకాల వస్తువులు విజయవాడ నుంచి విడతల వారీగా జిల్లాకు చేరుకుంటున్నాయి. వీటిని డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ సూచనల మేరకు అన్ని మండల స్టాక్ పాయింట్లకు చేరవేస్తున్నాం. అక్కడి నుంచి పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందించేందుకు జిల్లా సర్వ శిక్ష అన్ని ఏర్పాట్లు చేపట్టింది.

–సురేష్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్, సర్వశిక్ష, తిరుపతి జిల్లా



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.74,620
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,683
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.96,700
రిటైల్ వెండి గ్రాము రూ.98.70

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని తుమ్మూరు మొక్కల పెంపకం నర్సరీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం.. తుమ్మూరు నర్సరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడంపై హెడ్‌కానిస్టేబుల్ మధు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగి, బ్లూ కలర్ గళ్ల లూంగీ, తెలుపు కట్ బనియన్, ఆకుపచ్చ రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద చేపలు పట్టే వల, చొక్కా ఉంది. సమీపంలో పడి ఉన్న మద్యం బాటిళ్లను సైతం గుర్తించారు. అతిగా మద్యం సేవించి దప్పికతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలియక పోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి, స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

తిరుమలలో అనధికార దుకాణాలపై కొరడా



ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట అనధికార తట్టలను తొలగిస్తున్న రెవెన్యూ, టీటీడీ విజిలెన్స్ అధికారులు

తిరుమల: తిరుమలలోని ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల ఎదురుగా అనధికారంగా నడుపుతున్న తట్టలపై రెవెన్యూ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు షాపింగ్ కాంప్లెక్స్ రోడ్డుపై యాత్రికుల రాకపోకలకు ఇబ్బందికరంగా తట్టలను ఏర్పాటుచేసి అనధికార వ్యాపారాలు చేస్తున్నట్లు రెవెన్యూ విభాగానికి ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన రెవెన్యూ విభాగం, టీటీడీ విజిలెన్స్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ వద్ద అనధికార వ్యాపారాలను తొలగించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

నాలుగున్నర కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్
- మరో వ్యక్తి పరార్

తిరుపతి క్రైమ్: నగరంలోని ఆటోనగర్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను అలిపిరి సీఐ రామారావు అరెస్ట్ చేసినట్లు తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. బుధవారం అలిపిరి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. ఆటోనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద కొందరు వ్యక్తులు గంజాయిని తరలిస్తున్నట్లు మంగళవారం మధ్యాహ్నం సమాచారం వచ్చిందన్నారు. తమ సిబ్బంది వెంటనే వారిని చాకచక్యంగా అరెస్ట్ చేసినట్టు వెల్లడించారు. ఇందులో నగరానికి చెందిన ఎస్.శ్రీనివాస రావు, జైచంద్ర, సోమనాథ్ అలియాస్ సోము ఉన్నట్టు గుర్తించామన్నారు. తునికి చెందిన మురుగేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు వద్ద నుంచి నాలుగున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది కృషిని ఆయన అభినందించారు.

తుమ్మలగుంటకు జాతర శోభ



గంగమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గంగ జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అమ్మవారి ప్రతిమను తయారుచేసి నడివీధిలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో కొలువు దీర్చిన గంగమ్మ ప్రతిమలకు భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా సారెను తీసుకుని గంగమ్మకు సారెను సమర్పించారు. ఆ తర్వాత అమ్మవారి ప్రతిమను ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచార వ్యవహారాలు, పురాతన సంప్రదాయాలను నేటి తరానికి అందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు.



గ్రామ పెద్దలతో కలిసి గంగమ్మ ప్రతిమను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

గ్రామాల ఐక్యత, సమైక్యతకు ఈ జాతర నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, జాతర నిర్వాహకులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గంగమ్మ జాతరకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

అన్నను రక్షించబోయి..!



మృతి చెందిన అశోక్

గూడూరు రూరల్: ఘర్షణలో అన్నను వారించే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు అన్న చేతిలోని కర్ర తమ్ముడి తలకు బలంగా తగిలింది. ఈ క్రమంలో తమ్ముడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన గూడూరురూరల్ పరిధిలోని చెంబడిపాళెంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం.. రూరల్ పరిధిలోని చెంబడిపాళెం గ్రామానికి చెందిన పురిణి మస్తానయ్య, అదే గ్రామానికి చెందిన గురవయ్య మధ్య మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఆ వివాదాలు ముదిరి ఘర్షణకు దారి తీయడంతో మస్తానయ్య కర్ర తీసుకుని గురవయ్యపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో మస్తానయ్య తమ్ముడు అశోక్(30) అన్నను వారించే ప్రయత్నం చేయగా.. మస్తానయ్య చేతిలోని కర్ర అశోక్ తలకు బలంగా తగిలింది. తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అశోక్‌ను కుటుంబ సభ్యులు గూడూరులోని ఏరియా ఆస్పత్రికి , అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున అశోక్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోర్టుల వద్ద పటిష్ట భద్రత

తిరుపతి లీగల్: కోర్టుల ప్రధాన ద్వారం వద్ద పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కోర్టులకు వెళ్లే న్యాయస్థానాల సముదాయ మార్గాన్ని పోలీసులు పూర్తిగా మూసివేశారు. ఎన్నడూ లేని విధంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టడం విశేషం. కేసు వాయిదాలకు కోర్టులకు వచ్చే వారిని ప్రతిఒక్కరినీ తనిఖీలు చేసి లోనికి పంపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ సమీపంతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన అల్లర్ల కేసుల్లో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న టీడీపీ కార్యకర్తలు సుమారు 30 మందికిపైగా 2 క్రైమ్‌లో తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేశారు. ఆ పిటీషన్‌లపై బుధవారం వాదనలు ఉండగా కోర్టు గురువారానికి వాయిదా వేసింది. అలాగే తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో 14 మంది వైసీపీ కార్యకర్తలపై నమోదైన కేసులో వారు బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. ఆ పిటీషన్లు బుధవారానికి వాయిదా పడ్డాయి. అయితే ఆ కేసుకు సంబంధించిన సీడీ రాకపోవడంతో పిటీషన్లను ఈనెల 31వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో ఫిర్యాదిగా ఉన్న చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని బెయిల్ పిటిషన్‌లపై వాదనలు వినేటప్పుడు తన వాదనలు వినాలని కోర్టును కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. ఇరు పార్టీల కార్యకర్తలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌లపై వాదనలు ఉండడంతో కోర్టుల సమీపంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

పాత దొంగ అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలో రాత్రి వేళ ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న కరుడుగట్టిన పాత నేరస్తుని క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీస్ పీఆర్‌ఓ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు.. తిరుపతిలోని నెహ్రూనగర్‌కు చెందిన పులినరేష్ (42) తన స్నేహితులైన జగదీష్‌కుమార్, దాము, జెమినీ గణేశుతో కలిసి గతంలో చాలా దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ నేరాలకు గాను ఇతనిపై తిరుపతి ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ, గాజుల మండలం, శ్రీకాళహస్తి, ఎంఆర్‌పల్లి, రేణిగుంట, అలిపిరి, పెనుమూరు, రైల్వే కోడూరు, వెదురుకుప్పం, పుత్తూరు, నగిరి, రేణిగుంట పోలీస్ స్టేషన్లలో పలుమార్లు అరెస్టయ్యాడు. తిరిగి గత మూడు నెలల కాలంలో తిరుపతి, శ్రీకాళహస్తి చుట్టుపక్కల ప్రాంతాలలో ఆరు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. అలిపిరి చర్లపల్లి రోడ్‌లోని జూ పార్క్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.8,50,000 విలువ చేసే 138 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కారును తగులబెట్టేశారు!



గురునాథం

ఏర్పేడు: టీడీపీ నాయకులు తమ కారును తగులబెట్టి ధ్వంసం చేశారని మండలంలోని వికృతమాల ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు ఐతేపల్లి గురునాథం తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తన భార్య ఐతేపల్లి మాధవి పేరుతో ఏపీ07వీసీ2529 నంబరుతో స్కార్పియో ఉందన్నారు. రిపేరు కోసం వారం క్రితం తిరుపతి ఆటోనగర్‌లోని సమ్మీర్ గ్యారేజీలో ఉంచినట్లు వెల్లడించారు. తమ ప్రత్యర్థులైన గుర్తుతెలియని టీడీపీ నాయకులు గ్యారేజీలో తమ కారును మంగళవారం అర్ధరాత్రి తగులబెట్టారని ఆరోపించారు. ఈ విషయంపై రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.



ధ్వంసమైన కారు

ఉర్దూ భాషతో ఉన్నత లక్ష్యాలు

తిరుపతి కల్చరల్: ఉర్దూ ద్వితీయ భాషగా విద్యనభ్యసించే ముస్లిం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చని అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ ప్రతినిధులు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, షేక్ చాందు బాషా, డాక్టర్ అంజద్ అలీ బేగ్ తెలిపారు. గిడ్డంగి విధిలోని ఖాద్రి ఆశ్రమంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఉర్దూను రాష్ట్ర ద్వితీయ అధికార భాషగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో ఉర్దూను ద్వితీయ భాషగా ముస్లిం విద్యార్థులు గుర్తించి విద్యను కొనసాగించాలని సూచించారు. సరోజినీదేవి రోడ్డులోని ఏటీఎస్ కళాశాలలో ఉర్దూ అధ్యాపకులను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, స్కాలర్ షిప్‌ల సౌకర్యం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ముస్లిం విద్యార్థులు 2024–25 సంవత్సరంలో ఇంటర్‌లో చేరే వారు ఉర్దూను ద్వితీయ భాషగా తీసుకోవాలని సూచించారు. వివరాలకు 9849458781, 8247877978లో సంప్రదించాలని కోరారు. అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ ప్రతినిధులు షేక్ రబ్బానీ సాహెబ్, షేక్ పరీద్‌భాయ్, షేక్ మహ్మద్, షేక్ అబ్దుల్ అజాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ ప్రతినిధి సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాద్రి

‘పరుష’కు పోటెత్తిన వ్యాపారులు

పుంగనూరు : పట్టణంలోని మఠంగడ్డలో నిర్వహిస్తున్న శ్రీమాణిక్యవరదరాజస్వామి ఎద్దుల పరుషకు వ్యాపారులు పోటెత్తారు. వర్షాలు పడటంతో వేలాది పశువుల క్రయవిక్రయాలకు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. దీంతో పశువుల ధరలు అమాంతం పెరిగాయి. పొలం పనులకు గ్రామీణ ప్రాంతాలలో పశువునే అధికంగా వినియోగిస్తుండటంతో వీటికి గిరాకీ పెరిగింది. అయితే గత వారం నిర్వహించిన పరుషలో అక్రమాలు జరగడంతో దేవదాయశాఖ ఉప కమిషనర్ ఏకాంబరం ఆదేశాల మేరకు రైతులను వ్యాపారులు అధిక ధరలతో దోపిడీ చేయకుండా చర్యలు చేపట్టారు.



పుంగనూరు పరుషలో పశువుల క్రయవిక్రయాలకు వచ్చిన జనం